కోడి - కులమూ

(కథానిక)

వీరాసామి ఇంట్లో పసికందు పుట్టిందో లేదో, ఊరంతా వులిక్కిపడ్డట్టు "అబ్బ! ఏమి అందం, ఏమి సొగసు, నవరంగుల్తో నవనవ లాడుతూందే! దానికండ్లు కస్సున కరవ్వస్తున్నాయి. దానిబరువు బారు చూస్తే బంగారు బొమ్మే నే?" అంటూ అమ్మలక్కలంతా ఆశ్చర్య పోతున్నారు. అంతలో ఒకమ్మవచ్చి "అదే మిటీ, ఆ కర్రిమొద్దోడికి ఆపిల్ల ఎట్లా పుట్టిం దంటూ?" అంది. అంతా గల్లున నవ్వారు. "అది గాదే వయ్యారి వదినా, పుట్టింది పురిట్లోని కోడి పిల్లే" అన్నారు. అడిగినమ్మకు నోట్లో నెమ్ము కూడా లేకుండా పోయింది.

"వీరాసామి మాత్రం తక్కువోడా! ఆ కర్రెని కరుకైన కోరమీసాలు, కరవ్వచ్చే ఎర్రని నిప్పులాంటి కండ్లు, బిర్రున బిగించిన బిళ్ళల మొలతాడు, కయ్ కుయ్ మనే కిర్రు చెప్పులు, వాడికేం గత్తరే? కర్రోడు అయితే నేం నిప్పు కణికలాంటి మనిషి. పెండ్లాం గనుక ఎదురు మాట్లాడిందా వల్లు పంబరేగి వుడుకు నీళ్లు కావలసిందే. ఇంట్లో గతుకులేకపోయినా యీదుల్లో ఈరంగాలు దేనికి?" అంటూ రక రకాలుగా రొల్లుతున్నారు.

వీరాసామి కోళ్ళ కోసం ఒక కొట్టం వేశాడు. దానిలో అరలుకట్టి జాతికొక అర జాగా యిచ్చాడు. వీరాసామి పుట్టిన పిల్ల వంక చూస్తూ "ఎన్నాళ్ళకు దిగిందే వీరకోడి. కుంపట్లోనే కోరచూపులు చూస్తూందే. దీని దెబ్బకు ఇక తిరుగుండదు. పూరికోళ్ళన్నీ పారి పోతయ్. నెమలికోళ్ళన్నీ నక్కాలి. బెరసి యన్నీ బెదిరిపోవాలి. ఇంక సీమకోళ్ళంటావా? చెంతకేరావు" అంటూ సంటోడికి పాలిస్తూ కూర్చున్న భార్యతో పడావులు తొక్కు తున్నాడు.

"ఎన్నిపుడితే ఏం? ఊరా పేరా! ఇంట్లో వుప్పుంటే పప్పులేదు, పప్పుంటే వుప్పులేదు. వాటికి పెట్టే వరాలువుంటే యే యాపారమైనా చేసుకోవచ్చు. పిల్లలు వూపిరుండేందుకు పులవ గుగ్గిళ్లయినా లేక వునూరుమంటూంటే వున్న నాలుగురాళ్ళూ వాటికే పోస్తావు" అంది నాగమ్మ.

"అదిగాదే, పలనాటి నాయకీ నాగమ్మ పులుల్లాంటి పుంజుల్ని పెంచి పౌరుషంతో పందాలువేస్తే నీకు పిట్ట పౌరుషమన్నా లేదేం అంట. వాళ్ళంతా దేశాలకొరకు పందాలుపాడితే మన మా మాత్రం బతకలేమంటావా?" అంటూ దూసరతీగల్తో గంపని అల్లుతున్నాడు. ఇదంతా చూస్తున్న నాగమ్మకు కోళ్ళ వ్యవహారంలో కోపం వచ్చినా మొగుడంటే మునిగిపోయే ప్రేమ వుంది. ఎన్నిసార్లు కోపంతో ఎముక లిరగేసినా తాను తినంది అన్నం తినదు. కోపం వచ్చినప్పుడు కాస్త ఆణిగుంటే అంతమంచోడు లేడు. అదీకాక మొన్ననే ఇక కొట్టనని పిల్లల పేరుతో ఒట్టేసుకున్నాడు. అందుకే ఏమీ అనలేకపోయింది.

కోడిపిల్ల పుట్టటంతోటే కోడి పందె గాండ్లందరికీ కన్నుకుట్టింది. కస్సున కసురు కుంటున్నారు.

"కోడి పెద్దదై కూతగ్గనకవస్తే ఎదురుకూత లేక ఏల్తదనుకో! పేరెక్కిన కోళ్ళన్నీ పారు కుంటూ తోకలు తొక్కాలిసిందే! దిట్టయిన కోళ్ళన్నీ దిగతుడుపే" అనుకున్నారు.

ఊళ్ళో మీసాలులేని పురాణాలను పొర్లించే పంచాంగ సిద్ధాంతులూ, సగం తెలిసిన సాతాని దైవభక్తులూ, "కుర్రాళ్ళకేం తెలుసు కులాల వరస" అన్నారు. ఊర్లోలేని వన్నెకోడి ఎట్లా పుట్టింది? అదీ అమావాస్య తిథిరోజున, మూల నక్షత్రంలో పుట్టింది. శనిగ్రహణం మూడుకోళ్ళ గుర్రం యెక్కి ఇకిలిస్తున్నాడు.

యం. సూరి

దానికితోడు కులంకాని కులం, వరసకాని వరసది పుట్టం వూరికి చెరుపేనన్నారు. అందుకే తోకచుక్క పుట్టిందన్నారు. ఇంకేం, వూళ్ళో మీసాలు తిరిగిన పెత్తందార్లంతా రైట్, రైట్ అన్నారు.

నవరంగుల కోడిపిల్ల బుసబుసలాడుతూ, కిస కిస కరుపులతో, గునగున నడుస్తూ రోజురోజు కాయలో పెరుగుతూంది. పట్టువిడుపులు లేని ఆహారంతో వీరాసామి పిల్లను పరామరిక చేస్తున్నాడు. వీరాసామికి ఒక రకమైన కోడిని తెచ్చి మరొకరకం పుంజుని తెచ్చి గుడ్లుగుంజుతే రెంటికీపోలిన కొత్తరకం పిల్లపుడుతుందని గాఢమైనవిశ్వాసంవుంది. అందుకేతనకున్న కొద్దిపాటి పొలం ఆదాయంలో చాలవరకు వినియోగించి జాతిజాతుల కోళ్లను కొన్నాడు అనేకసార్లు పొదిగించాడు. వాటి ఫలితమే ఈ కోడి. "ఈ రోజుల్లో కుర్రాళ్లనే నమ్మకూడదు. కోళ్ళను ఎలా నమ్ముతాం" అనుకొని వీరాసామి పిల్లను చాలా జాగ్రత్తగా చూస్తున్నాడు. వీరసామి కోడికి మేతవేస్తూ దువ్వుతున్నాడు. అంతలో నాగమ్మ వచ్చి "ఏమయ్యోయ్" అంది.

"....."

"నిన్నే పిలిచేది. ఊర్లో ఏమను కుంటున్నారో తెలుసా? వరసా వాయీలేని పిల్లంట. తిథి నక్షత్రం మంచిది కాదంట. ఇది వుండటమే ఊరికి చెరుపంట అని వూర్లో పెద్దలు, ఇరుగు పొరుగంతా పుల్లపోటు వేస్తున్నారు. కనబడ్డ ఆడదీ మొగోడూ కయ్యానికి కాలుదువ్వుతూంటే మాట్లాడవేం?"

"అంటే ఇపుడేమయిందీ?"

"ఏం అయిందంటావేం? అందర్నీ కాదని అడ్డంగా నడుస్తావా?"

"అడంగా నడిచే అవసరం యేముంది? మన పిల్లోళ్లు అచ్చంగా మనమల్లే వున్నారా? అందరూ అంతే. తిథి, నక్షత్రం సరిగా లేవని వూర్లో వాళ్ళంతా పుట్టిన పిల్లల్ని పురిటోనే పిసికేస్తున్నారా? కోడి విషయం కూడా అంతే. కాని వూర్లో వాండ్లకు ఏం తెలుసు ఈ విషయం. మోతుబరులు పంచాంగాలతో బతికే జబర్దస్తీ సోమరిపోతులంతా తేవెపూసిన విషవుమాత్రలు అమాయక ప్రజల అంట్లో వేస్తున్నారు. తెలియనివాళ్ళకు చెప్పటంపోయి వాళ్ళ పొదాలు పట్టాలంటావు. అంతేగా? ఎన్నాళ్ళు సాగుతాయే వీళ్ళ మోసాలు. ప్రజలు ఎప్పుడో ఒకప్పుడు వీళ్ళ పని పట్టకమానరా? నేను ఇట్లా వాళ్ళని తూర్పారపడతాననే నామీద కోపం. నామీద కసి తీర్చుకునేందుకే జనానికి కైపు యెక్కిస్తున్నారు. కానీ ఎంతవరకు చేస్తారో చూస్తాగా!" అనేటప్పటికి నాగమ్మ నాలుక పిడచగట్టి ఏమీ మాట్లాడలేక చివరకు "ఏ ఏట్లోనన్నా దూకు నాకేం" అంటూ పోయింది.

"తెలివి తక్కువ నాగమ్మ, దీనికేం తెలుసు. వూర్లో వాండ్ల మాటలకు వుక్కిరి బిక్కిరైనన్ను కూడా బెదరించ వచ్చింది" అనుకుంటూ వీరాసామి "అరే నడిపోడా ఇటరా" అని తన రెండవ కొడుకును పిల్చాడు. "అయ్యా కోడిని నే నేత్తా నే పంచం" అంటూ నడిపోడు వచ్చాడు.

"అప్పుడే ఏం పందెంరా, ఆరెన్న ముదరక పోతేను. సరేగాని, మన పులిపుంజుని వూర్లో వాండ్లు చంపేస్తారోయ్! వాళ్ళ మాటలు మీ అమ్మకి కూడా అంటినయ్."

"ఆ, మన కోడినా చంపేదీ! కొంకు లిరగెయ్యనూ. ముందు మేడోళ్ళ కౌమిగాడ్ని మసి చెయ్యాలయ్యా, నామీద కంటే ఒంటికాలుమీద వస్తాడే!" అని నడిపోడి నాదం వింటంతోటే వీరాసామికి హుషారెక్కింది. అసలు నడిపోడు పక్కనుంటేనే వెయ్యిమంది వున్నట్లు.

"భేష్ అట్టుండాలి. పెద్దోడు ఒట్టిపిరికోడు. నీవేరా గండెడివి. జాగారం చేసైనా జాగ్రత్తరోయ్" అంటూ వీరాసామి బయటకు వెళ్లాడు.

"ఇంకేం వుంది ప్రక్క వూర్లల్లో అమ్మవారు అదిరి పడుతూందంట, అటలమ్మ అల్లి పోతూందంట, గత్తర గాండ్రిస్తూందంట" అంటూ గడిగడికీ కబుర్లు వస్తున్నాయి. పొరుగూరి వాండ్లను పొలిమేర దాటి రానియ్యటం లేదు. చద్ది మూటల్ని సాలుకైనా రానియ్యటం లేదు. అవి వినటంతోటే గ్రామంలోని శివాళ్లు పెరిగే శిష్య బృందానికి గ్రామ దేవతలంతా కళ్ళల్లో కనబడుతున్నారు. ఈ ధేడు ఒక్క

అమ్మోరే కాదు. యేడు గురు తోబుట్టులూ ఉగ్రులై అదిరిపడుతున్నట్లు అగపడుతున్నారు. వూర్లోని అమ్మలక్కలంతా అధైర్యాలతో ఆప సోపాలు పడుతున్నారు. పిల్లల్ని పక్కలు దిగ నీయటంలేదు. పొద్దూకితే పిల్లయినా లేక ఈదు లన్నీ ఈటుబోయి వుంటున్నయ్. పెద్దలంతా దీనికంతా వీరాసామి విర్రవీగుడే అన్నారు. కారణమంతా కులంలేని కోడేనన్నారు. జాతర జరిపి అమ్మోరికి కోడిని ఆహారం యియ్యా లన్నారు. వీరాసామిని పిలవండి! పిలవండ న్నారు. ఒకడు "వాడు ఒట్టిపెడకట్టెరా. వాడు మాటల్తో వింటాడా? మాటలు పెడితే మసి బూస్తాడు. ఆ రోజుకల్లా ఆడ్ని కాదనై నా కోడ్ని కొయ్యాల" అన్నాడు. అంతా నిజమే నంటే నిజమే నన్నారు, ఒకవైపు ప్రాణభయమున్నా! భవిష్యత్తు బంకలాగా తతికింద నే సోమరి సిద్ధాం తులంతా "నేను చెప్పలా! నేను చెప్పిందేగా" అంటూ చంక లెగరేస్తున్నారు. పెద్దత్తున పైసలు పిండవచ్చునని పరమానందాలు పొందుతు న్నారు. చాకళ్లు, మంగళ్ళు, పెదమాదిగాం డ్లకు ఈడిగానికి ఇనాంగా కమ్మని తిండి, కరువులేకుండా కల్లుముంతలు దొరుకుతాయనే కాంక్షతో గ్రామమంతా కలగా పులగంగా వుంది. పొలాల పనులన్నీ పక్కకు నెట్టారు. పెద్దలంతా పగలల్లా ఇంటింటికి పైసలు పోగు చేస్తున్నారు. కమసలాండ్లకు కరువైన పని కళ కళలాడింది. టైలర్లకు తరుగైన పని తళతళ లాడింది. కల్లుకొట్టునిండా కరువులేకుండా కడ వలు కనబడుతున్నాయి. ఇంటింటికీ పోయి పెరుగన్నాలు పోగు చేస్తున్నారు.

జాతరజాగారం మొదలైంది. సంబరం సంగులు తిరిగేందుకు సాగింది. చుట్టూ చాకళ్ళ చమురు కాగడాలు కొలుతున్నాయి. మంగళ్ల మేళాలు మోగుతున్నాయి. ముసలా ముతకా అంతా బజార్లు ఇరగతొక్కుంటున్నారు. పసిబిడ్డలు నిద్రలతో ఆవలిస్తున్నారు. యువతీ యువకులు తమతమ ప్రియులని చూచి పొంగి పొర్లిపోతు న్నారు. కొత్త ప్రియుల కొరకు కోరమాపులు చూస్తున్నారు. అత్తలంతా కోడళ్ళ కొంగుల్ని కదలనీయటం లేదు. అబ్బ! చెప్పటానికి సాధ్యమా! ఇగిలింపులతో, పకపకలతో, పెడ బొబ్బలతో కొలుపంతా కోలాహలంగా కదలి పోతూంది.

ఇంతలో ప్రక్కవీధినుండి కలకలం బయలు దేరింది. తలపగిలి రక్తధారలు దొర్లుతున్నాయ్. వల్లంతా వాతలతో తాటరేగింది. వీరాసామికి స్పృహ తప్పింది. నోట నురుగు నొరుగు తూంది. పెడరెక్కలు విరిచి పగ్గాలు కట్టారు. పక్కనే నడిపోడ్ని పదిమంది పట్టుకొస్తు న్నారు. పాపం! ఏంచేస్తాడు వీరాసామి. అంతకీ కొంతమందిని కొంగేసాడు. కాని వందలజనాన్ని జంకవేయలేకపోయాడు. కోడి మాత్రం సందుకొనిచ్చిందా? చెయ్యి పెట్టి నోళ్ళనల్లా నొక్కేసింది. పట్టినోడినల్లా పదునైన ఆరెతో అవరేసింది. చివరకు గంపలో వుండ బట్టి దొరికిపోయింది. వీళ్ళనిపట్టి జనం, కొలుపు సంబరంలో కలిసారు. సంబరం సందులన్నీ కలియదిరిగి అమ్మోరు గుడికి చేరింది. "వీరా సామి వీగుడు వీగిందిరా!" అంటూ కొంత మంది, "కులంలేని కోడి కోతకు వచ్చిందిరా!" అంటూ మరికొందరూ ఆనందిస్తున్నారు. ఇదంతా చూస్తున్న పెద కాపు కొడుకు సూరయ్యకు ప్రాణం చివుక్కుమంది. ఇదంతా పెత్తందార్ల ఘోరాలే అనుకున్నాడు. ఈ భాగాతాన్నంతా భగ్నం చేయాలనుకున్నాడు.

జనమంతా తాగి తందానాలాడుతున్నారు. ఊరంగాలు తొక్కుతున్నారు. మధ్య "మాతంగి" మందహాసాలతో నాట్యం చేస్తూంది. కోడిని స్నానంచేయించారు. పసుపు కుంకం పెట్టారు. పెదమాదిగ తల తెంచేందుకు తయారయ్యాడు. రుంజులు రేగినయ్; వీరణాలు బుర్రు, బుర్రున భోరుమన్నాయి; పంబలు పట పటమన్నాయి; తప్పెట్లు దడదడ లాడుతూ పెళ్లున పలుకుతున్నాయి గుగ్గిలధూపపు దుమా రం రేగుతూంది. "కాసి! కాసియండి" అంటూ కేకలు వినబడుతున్నాయ్. అంతలో అమాం తంగా అందరూ నిర్ఘాంతిపోయేటట్లు పెద కాపు కొడుకు సూరయ్యకు శివమెక్కింది.

"అద్దద్దద్ద - భ - ఈ కోడి నాకొద్దూ-నా కొద్దూ ఈ కోడి. దేశాన్నేలు దేవతన్రోయ్- అమ్మోరు కానర్రోయ్. అద్దద్దద-భ"- అనే

టప్పటికి అందరూ "అమ్మోరు కాదు! కాద" న్నారు-"అందుకే పలకుమారింది" అన్నారు. "అద్దద్దద్ద-భ - అమ్మోరు అయితేను పింఛాను కెళ్ళింది. కోరింది మీరైతే చేస్తేనే చేశారు. లేకుంటే అందర్ని లేకుండా చేస్తాను అద్దద్దద్ద-భ-హింసాను చేసేటి శక్తిని కౌనర్రోయ్-అహింసా మార్గంతో అందర్ని రక్షిస్తా. రేపైతే మీరంతా సర్కారు మనుష్యుల్తో - టీకాలు నూదులూ వేయించితీరాలి. లేకుంటే అందర్ని మింగేస్తా, నలిపేస్తా, వూడుస్తా అద్దద్దద్ద-భ భ-భ" అంటూ సూరయ్య క్రింద వొరగబోయే టప్పటికి అందరూ వచ్చి క్రింద పరుండ బెట్టారు. ఇంకేముంది! అందర నోళ్లల్లో కర్రులు దించినట్టయింది. అంతా నిశ్శబ్దం. ఇదంతా చూస్తున్న నడిపోడు "అయ్యోయ్! మన కోడిని వదలిపెడతరంటనే" అంటూ సృహ తప్పివున్న వీరాసామితో అన్నాడు.

"ఆ! ఆ! మన కోడినా! వదిలిపెడితారా" అంటూ లేచి జనంవంక చూస్తూ "దీనికంతా కారణం కోడికాదని అమ్మోరికి మాత్రం తెలియదంటారా? అందుకే ఆహారం వద్దన్నది. కోడికి కులమట కులం, వన్నెట వన్నె! మీ పిల్లలందరికీ మీ రూపు రేఖలే వున్నాయా? మీరంతా మీ అయ్యలల్లే వున్నారా? తిథి, నక్షత్రం సరిగా లేదని మీ పిల్లలను పిసికేస్తున్నారా? మాట్లాడరేం? కోడి కూడా అంతే. మీరంతా పెత్తందార్ల, సెంటు భూమి లేకనే సెభాష్‌గా బ్రతుకుతున్న సోమరిపోతుల మాటలకు మోసపోయారు. అందుకే ఇంత అఘాయిత్యానికి పాలుపడ్డారు" అంటూ పండ్లు పట పట కొరికేటప్పటికి పెత్తందార్లంతా పరారయ్యారు. అందరూ చేసినపనికి పశ్చాత్తాపపడి నిముషం నిశ్శబ్దంగావుండి అందరూ వీరయ్య వద్దకు వచ్చి "అరే, వీరయ్యా వాళ్ళమాటలు నమ్మి మోసపోయ్యాంరా! తెలిసో, తెలియకనో చేసాం. వాళ్ళపని పడుదాం, ఏం అనుకోబాక" అని అన్నారు. అంతలో నాగమ్మ పిల్లల్తోవచ్చి వీ రా సా మి సరసనే వాలింది. తెల్లవారుతూంది. అప్పుడే కులంవచ్చిన కోడి రయ్యిన నవరంగుల రెక్కలు రెపరెపలాడిస్తూ అమ్మోరుగుడి ఎక్కింది. కొత్తరకం కూత కూసింది. ఆ రో జు కు, అదే తొలికూత. కూత వింటంతోటే వూర్లో కోళ్ళ కవులన్నీ కరగి కలవరించాయి. వీరాసామి తన కర్రని కోరమీసం దువ్వుతూ "నాది వీరకులం కోడిరా" అన్నాడు. నడిపోడు సహితం తొడ సరుస్తూ "నాది ఈరకోడిరా" అన్నాడు. అంతలో సూరయ్యవచ్చి వీరాసామి చెవులో ఏదో చెప్పాడు. అది పక్కనేవున్న నాగమ్మ, పిల్లలూ విన్నారు. అందరూ ఆశ్చర్యపోయారు.

కథానిక

సుఖపడ్డ జీవుడు

"విశ్వమిత్ర"

"రామారావు చనిపోయాడు. ఆత్మహత్య"

పొద్దున్నే ఈ మాటలు విన్న సుగుణ ఒక్కసారి కెవ్వున కేకేసింది.

రామారావు చనిపోయినందుకు ఆమెకేమీ దిగులులేదు. కాని అతను ఆత్మహత్య చేసుకోవటం ఆమెతో అతనికున్నసంబంధాన్ని జ్ఞాపకం చేసింది.

తనకు రామారావుతో వున్న రెండేళ్ళ పరిచయంలోనూ అతనెప్పుడూ ఆత్మహత్య చేసుకొంటానని సూచన ప్రాయంగానైనా అనకపోగా తన దగ్గిర వున్నంత సేపూ నిజంగా మృత్యువు వొచ్చి మీదపడ్డా ఎదుర్కొనేట్టు మాట్లాడేవాడు.

ఆమెకి తెలిసినంతవరకూ అతనికి ఆత్మహత్య చేసుకోవాలిసినంత అవసరంఏమిటోబోధపళ్లేదు.

నిజంగా అతను సుగుణ కోసమే ఆత్మహత్య చేసుకొనివుంటే ఇప్పుడు ఆమె చెయ్యవలసిన పనేమిటి?